


# కరపత్రం

SINCE 2014

శనివారం ఆగస్ట్ 08, 2026 | సంపుటి : 2 | సంచిక : 297 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## విస్తారంగా వర్షాల కోసం
# వరుణ యాగం

- సీఎం రేవంత్ కీలక నిర్ణయం
- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో యాగం
- దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- కృష్ణా-గోదావరికి ప్రత్యేక పూజలు
- పాడిపంటల సమృద్ధికి సంకల్పం
- ఉత్తమ్ సారథ్యంలో యాగం
- పూర్ణాహుతిలో సీఎం రేవంత్ పాల్గొననున్నారు

**హైదరాబాద్:**
రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన ముహూర్తం మేరకు ఈనెల 10న నాగార్జునసాగర్‌లో ఈ యాగం నిర్వహించనున్నారు. సాగర్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణంలో దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చకులు యాగక్రతువులు నిర్వహించనున్నారు. కృష్ణా-గోదావరి నదులు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు చేయనున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరగనుందని తెలంగాణ సీఎం కార్యాలయం తెలిపింది.



# వరి సాగులో
# అప్రమత్తంగా ఉండాలి

- » ఎల్‌నినోపై ఉత్తమ్ హెచ్చరిక
- » నీటి లభ్యతను బట్టి సాగు
- » తక్కువ నీటి పంటలకు ప్రాధాన్యం
- » జిల్లా నీటిమండళ్లు పునరుద్ధరణ
- » రైతులకు శాస్త్రీయ సూచనలు
- » నీటి విడుదలలో అప్రమత్తత
- » తాగునీటి నిల్వలకు ప్రాధాన్యం
- » రాజకీయ ఒత్తిళ్లకు తావులేదు
- » 61 లక్షల కొత్త లబ్ధిదారులు
- » 16 లక్షల కొత్త రేషన్ కార్డులు
- » ఆగస్టు 15న స్మార్ట్ రేషన్ కార్డుల ప్రారంభం

**హైదరాబాద్:**
ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలనిరాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత వర్గాలతో కూడిన జిల్లా నీటిపారుదల సలహా మండళ్లు ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో తప్పనిసరిగా సమావేశమై జలాశయాల నీటి నిల్వలు, ఆశించదగిన నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, కమాండ్ ఏరియాల్లోని సాగు పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి రైతులకు శాస్త్రీయమైన, విశ్వసనీయమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు.

2లో..




## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు హాట్ కామెంట్స్

**హైదరాబాద్:**
ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉచిత పథకాల అమలులో అర్హుల ఎంపిక, ప్రభుత్వాల బాధ్యతపై కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. శుక్రవారం ఒక కేసు విచారణ సందర్భంగా.. కోటీశ్వరులు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని వ్యాఖ్యానించింది.

2 లో



## నల్లకుంటలో విషాదం! సిలిండర్ పేలి ఇద్దరు మహిళలకు గాయాలు

**హైదరాబాద్:**
నగరంలో ఆదిక్‌మెట్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి సిలిండర్ పేలుడు సంభవించింది. దీంతో స్థానికంగా భయాందోళన పరిస్థితి నెలకొంది. ఆదిక్‌మెట్ పరిధిలోని వడ్డర బస్తీ, ప్రభుత్వ పాఠశాల సమీపంలో రాత్రి సుమారు 8:45 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- » పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం
- » మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. మిగతాద్ది 2 లో

# 'బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది'

- బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం
- నీటి పంపిణీ ప్రణాళిక ప్రకారమే
- రేవంత్‌పై ప్రచారం అసత్యం
- రాజకీయాల కోసమే హంగామా
- నీటి విడుదలపై క్రెడిట్ రాజకీయం
- పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- బీఆర్ఎస్ వైఫల్యాలే ఎక్కువ
- కృష్ణా జల హక్కులు సాధిస్తాం
- రైతులు ఆందోళన చెందొద్దు
- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి
- సాగునీటికి అన్ని చర్యలు
- ప్రాజెక్టుల పనులు వేగవంతం



2లో..

**హైదరాబాద్:**
ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



## తెలంగాణలో అధికారంలోకి
# రావడమే బీజేపీ లక్ష్యం

- ఒంటరి పోరాటంతోనూ అధికారం సాధిస్తాం
- బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్ట్7 :**
తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. మిగతాద్ది 2 లో

## సైబర్ నేరగాళ్లపై పోలీసుల ప్రత్యేక ఆపరేషన్..
# 15 రాష్ట్రాల్లో 49 మంది అరెస్టు

**హైదరాబాద్:**
సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణ సహా 15 రాష్ట్రాల్లో విస్తరించిన సైబర్ ముఠాల గుట్టురట్టు చేశారు. మొత్తం 49 మంది నిందితులను అరెస్టు చేసి, రికవరీ చేసిన రూ.98.89లక్షల డబ్బును బాధితులకు రిఫండ్ చేశారు. జులైలో 70 సైబర్ క్రైమ్ సంబంధిత ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రేడింగ్ మోసాలే అత్యధికంగా జరిగాయని.. ఆ కేసుల్లో 29 మందిని అరెస్టు చేశామని వివరించారు. మొత్తంగా 25 డెబిట్‌కార్డులు, 23 మొబైల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జోనల్ సైబర్ సెల్స్ ద్వారా 298 కేసులు నమోదు కాగా.. ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు




వెల్లడించారు. 128 నకిలీ సోషల్‌మీడియా ప్రొఫైళ్లు, 36 నకిలీ యాడ్స్‌ను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే కాల్స్ పూర్తిగా నకిలీవేనని పోలీసులు స్పష్టం చేశారు. వాటిని నమ్మొద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి
# సంచలన ఆరోపణలు




**హైదరాబాద్:**
తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కోర్టులో సంచలన ఆరోపణలు చేశారు. రెండు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో అత్తాపూర్ పోలీసులు ఆయనను ఉప్పరపల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టు హాలులోనే ఉదయ్ కృష్ణారెడ్డి బోరున విలపించారు. సైబరాబాద్ సీపీ సజ్జనార్‌పై ఆయన మేజిస్ట్రేట్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ పేరుతో తనను సీపీ సజ్జనార్ తీవ్రంగా బెదిరించారని, 'నిన్ను ఎన్‌కౌంటర్ చేస్తాం' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఉదయ్ ఆరోపించారు.

# సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరు

**- బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 07 :**
సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరని బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.


02

# 'బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది'

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అయినప్పటికీ ఆల్మట్టి, జూరాల నుంచి నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు ప్రణాళిక ప్రకారం నీటి పంపిణీ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. సాగునీటి అధికారుల సూచనల మేరకు వచ్చిన ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటి నిర్వహణ జరుగుతోందని చెప్పారు.
సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని జూపల్లి స్పష్టం చేశారు. పాలమూరు బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా అల్లుడు అయిన సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిని నిలిపివేశారన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.
ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ పబ్బం గడుపుకోవడానికే బీఆర్ఎస్ హంగామా చేస్తోందని ఆరోపించారు. జూరాలకు నీళ్లు వదలాలంటూ ప్రాజెక్టుల వద్ద ముందుగానే డ్రామాలు చేస్తూ, అధికారులు నీటిని విడుదల చేసిన తర్వాత దానిని తమ క్రెడిట్‌గా ప్రచారం చేసుకోవడమే వారి లక్ష్యమని విమర్శించారు.
ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్టులకు కాంగ్రెస్ హయాంలోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.
చెడిపోయిన పంపులు, మోటార్లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలను కూడా మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. భీమా ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశాన్ని బీఆర్ఎస్ కోల్పోయిందని, జూరాలకు 50 టీఎంసీల నీటి వినియోగానికి అవసరమైన రిజర్వాయర్లు కూడా నిర్మించలేదని అన్నారు. గట్టు, తుమ్మిళ్ల వంటి ప్రాజెక్టులను సైతం విస్మరించిందని ఆరోపించారు.
ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కృష్ణా జలాల్లో ఉన్న హక్కులను సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతుందని జూపల్లి పేర్కొన్నారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడుతూ తెలంగాణ ప్రయోజనాలను సాధిస్తామని స్పష్టం చేశారు.
ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు అధికారులు సూచించిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పంట కొనుగోలు, బోనస్ అంశాలపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం అసత్యమని, పాలమూరు జిల్లా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ఉమ్మడి పాలమూరు జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి జూపల్లి వెల్లడించారు.

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశర చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశర చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.

## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. ఎఎఊ÷ు ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# వరి సాగులో అప్రమత్తంగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీలైన జిల్లాల్లో రేపటి నుంచే నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ మండళ్లు కేవలం నీటి విడుదలలపై నిర్ణయాలు తీసుకునే వేదికలు మాత్రమే కాకుండా రైతులు ఏ పంట వేస్తే భవిష్యత్తులో నష్టపోకుండా ఉంటారో ముందుగానే తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జలాశయాల నీటి నిల్వలు, రుతుపవనాల మిగిలిన కాలంలో వర్షపాతం అంచనాలను పరిశీలిస్తే అత్యంత జాగ్రత్తతో పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.
నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను సాగు చేయవద్దని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆ వర్షాలను ఆధారంగా చేసుకుని రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదన్నారు. ఒకసారి తడిపే అవకాశం లభించినా, రెండోసారి నీరు అందించే పరిస్థితి అనిశ్చితంగా మారే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రోత్సహించి రైతులను పంట వేయించి రెండు మూడు నెలల తర్వాత ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతి కమాండ్ ఏరియాలో ఎంత మేరకు సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలని సూచించారు.
రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల ప్రస్తుత పరిస్థితిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదని పేర్కొంటూ, ఆయా కమాండ్ ఏరియాల్లో నేల స్వభావం, నీటి లభ్యత, వ్యవసాయ శాఖ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు.
వచ్చే వేసవిలో రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణారహితంగా నీటిని విడుదల చేయరాదని హెచ్చరిస్తూ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబుతో సమన్వయం చేసుకుని భవిష్యత్తు తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా ఎంత నీటిని నిల్వ ఉంచాలనే అంశాన్ని నిర్ణయించాలని ఆదేశించారు.
అదే వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంవత్సరాల అనంతరం అర్హులైన కొత్త లబ్ధిదారులను ప్రజాపంపిణీ వ్యవస్థలో చేర్చి రేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఈ క్రమంలో సుమారు 61 లక్షల మంది కొత్త లబ్ధిదారులను చేర్చి దాదాపు 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 1.06 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ సేవలు అందుతున్నాయని, ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యం స్థానంలో ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభిస్తారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

## నల్లకుంటలో విషాదం! సిలిండర్ పేలి ఇద్దరు మహిళలకు గాయాలు

మొదటిపేజీ తరువాయి

సమాచారం అందుకున్న నల్లకుంట పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనలో సునీత, పుష్పలత అనే ఇద్దరు మహిళలు గాయపడగా, వారిని వెంటనే చికిత్స నిమిత్తం దగ్గరలోగల సౌమ్య ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.అయితే సిలిండర్ పేలడానికి గల కారణాలు ఇంకా తెలిసిరాలేదు. ప్రమాదానికి సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరు

మొదటిపేజీ తరువాయి

గత ఎన్నికల్లో వరుస ఓటములపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై జరుగుతున్న ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రచారంపై ప్రతి కాంగ్రెస్ నేతకు బాధ్యత ఉందని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో స్పోక్స్ పర్సన్లను నియమిస్తామని తెలిపారు. మండల అధ్యక్షులు వారానికి ఓ సారి ప్రెస్ మీట్ పెట్టాలని వారిని ఆదేశించారు.

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు హాట్ కామెంట్స్

మొదటిపేజీ తరువాయి

రైతుల కోసం అమలు చేసిన రైతుబంధు వంటి పథకాలలోనూ సంపన్నులు లబ్ధి పొందిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. నిజంగా అవసరం ఉన్నవారికి ప్రభుత్వ సాయం అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అలాగే ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపై హైకోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. భవిష్యత్ తరాలకు ప్రభుత్వాలు ఏం మిగులుస్తున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.
"ఒకప్పుడు దేశానికి ఏం ఇచ్చామా? అని ఆలోచించేవాళ్లం.. ఇప్పుడు దేశం మనకేం ఇచ్చిందని అడుగుతున్నాం" అంటూ సామాజిక బాధ్యతపై కోర్టు వ్యాఖ్యలు చేసింది.

### చదువుకు సాయం.. అర్హులకు సంక్షేమం

ప్రభుత్వ నిధులు సరైన దిశలో వినియోగించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. బాగా చదువుకునే విద్యార్థులకు ఫీజులు, నిజంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని సూచించింది.

### 1.15 కోట్ల మందికి పథకాలు.. ప్రభుత్వ నిర్వహణ ఎలా?

రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ప్రజలకు ఉచిత పథకాలు అందిస్తే ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. 1.15 కోట్ల మందికి ఉచిత పథకాలు ఇస్తున్నప్పుడు భవిష్యత్‌లో ప్రభుత్వాలు వాటిని ఎలా కొనసాగిస్తాయనే ప్రశ్నను లేవనెత్తింది.
సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా ఉండాల్సినవేనని, అయితే వాటి అమలులో పారదర్శకత, అర్హత ప్రమాణాలు కీలకమని హైకోర్టు వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజా ధనం సద్వినియోగం కావాలంటే అవసరమైన వారికి మాత్రమే ప్రయోజనాలు చేరేలా విధానాలు ఉండాలని సూచించింది.

## బోనాల పండగతో 9న మద్యం దుకాణాల మూసివేత

మందుబాబులకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ షాక్ ఇచ్చారు. బోనాల పండుగ సందర్భంగా ఆగస్టు 9న మద్యం దుకాణాలను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లు మూసివేయాలని సీపీ రమేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని సీపీ రమేశ్ పేర్కొన్నారు. రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లకూ ఈ ఆదేశాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు. అయితే స్టార్ హోటళ్లలోని బార్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లకు మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. ప్రజా శాంతి, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బోనాల వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ రమేశ్ పేర్కొన్నారు.

## చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు

దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ధి: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓ÷ూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎపిలో పిడుగులతో కూడిన వర్షాలు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వర్షాలకు సంబంధించిన వివరాలను ఆ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. శనివారం ఉత్తరాంధ్రలో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు తీరప్రాంతంలో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ చెప్పారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఉత్తర, మధ్య కోస్తాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వర్ష సూచన ఉన్నట్లు పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరులో వానలు పడతాయని వెల్లడించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో చెదురుమదురుగా.. మార్కాపురం ప్రాంతంతో పాటు రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.
సందర్భగా ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిడుగులతో కూడిన వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ వంటి వాటి వద్ద నిలబడవద్దని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

న్యాయస్థానానికి సమర్పించిన ఫిర్యాదులో ఉదయ్ కృష్ణారెడ్డి పలు కీలక అంశాలను పేర్కొన్నారు. నన్ను సీసీ కెమెరాలు లేని చోటుకు తీసుకెళ్లి విచారించారు. టాస్క్‌ఫోర్స్ ఆఫీసులో ఉంచి తీవ్రంగా హింసించారు అని వాపోయారు. నిందితుడి ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన మేజిస్ట్రేట్.. సీసీ కెమెరాలు లేని చోట విచారణ ఎలా జరుపుతారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రెండు రోజుల్లోగా పూర్తి వివరణ ఇవ్వాలంటూ అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు కోర్టు షోకాజు నోటీసులు జారీ చేసింది

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు

- ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్‌ఆర్టీసీ గతంలో హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్‌ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్‌ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్‌ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# ఆకలి ఒక తల్లిని నేరస్థురాలిని చేసింది

# బాధ్యత లేని తండ్రి వల్ల కుటుంబం నాశనమైంది

బోయిని సత్యనారాయణ,అడ్వకేట్

- ఇది చట్టానికి అందని జీవిత కష్టాల కేసు.
- ఒక తల్లి నిస్సహాయతకు సజీవ సాక్ష్యం ఈ కేసు
- పిల్లలకు అన్నం పెట్టలేని ఆ తల్లి నిస్సహాయ పెద్దరికం చేసిన అసంకల్పిత చర్యకు ప్రతిరూపం ఈ కేసు
- ఇది సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన కేసు
- మొత్తంగా ఇది ఆకలి చేసిన నేరం
- ఈ కేసులో అసలైన హంతకుడు ఆ కుటుంబ పెద్ద అయిన తండ్రి

ఈ కేసు పూర్వాపరాలు చూస్తే మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరి గుండె తడిగా మారుతుంది.

- ఏమీ చేయాలని న్యాయస్థానం, మన గుండెలు బరువెక్కే వ్యాఖ్యతో పాలకులకు చురకలు అంటించిన కేసు ఇది.

గుజరాత్ రాష్ట్రం, సూరత్ జిల్లా లోని వరాచ్ఛా పోలీస్ స్టేషన్ లో నమోదైన ఈ కేసు నవీన భారతంలో విలువలు చచ్చిపోయిన వారి, బాధ్యతలు మరచిన కుటుంబ పెద్దల లోపాలను పట్టి చూపుతున్నది.

FIR/C.R. No. 11210060/26-06-25 of 2026 వరాఛ్ఛా పోలీస్ స్టేషన్, సూరత్ జిల్లా లో నమోదైన హత్య కేసు.

**కేసు నేపథ్యం**

- **గుజరాత్ లోని సూరత్ కు చెందిన శ్రీమతి లఖీబెన్ సోలంకి అనే గృహిణి భర్త ఆరు నెలల క్రితమే కుటుంబాన్ని వదిలేసి వెళ్ళిపోయాడు.**

- **తీవ్ర పేదరికంలో మగ్గుతున్న ఆమె, మార్చి 2026 లో తన రెండేళ్ల కుమార్తె ఈషా ఆకలితో అన్నం కావాలని పదే పదే అడగడంతో,నిస్సహాయతతో ఆగ్రహానికి గురై పాపను కొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆ చిన్నారి ఆసుపత్రిలో మరణించింది.**

- **ప్రస్తుతం నిందితురాలు ఏడు నెలల గర్భిణి కావడంతో పాటు, ఆమెకు మరో ఇద్దరు చిన్న పిల్లలు ఉండటం, విచారణకు సమయం పడుతుండటాన్ని పరిగణనలోకి తీసుకుని గుజరాత్ హై కోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేసింది.**

**స్థూలంగా కేసు వివరాలు ఇంతే**

**ఒక కేసు,అరెస్ట్,జ్యుడీషియల్ రిమాండ్,బెయిల్...మాత్రమే కాదు....ఈ కేసులో పాలనా వ్యవస్థ,సామాజిక వైఫల్యం రెండూ కనిపించని నేరస్తులే.**

కూతురు కడుపు నింపలేని నిస్సహాయతలో ఒక తల్లి తన కూతురు ఏడుపును ఆపలేక, సముదాయించలేక చిరాకు పడి, బాధపడి అసంకల్పితంగా కొడితే ఆ పాప చనిపోయింది.

- **చట్టం ప్రకారం ఆమె నేరస్తురాలయింది.**

ముగ్గురు పిల్లల్ని కని,మళ్లీ భార్యకు కడుపుచేసి కూడా బాధ్యత లేకుండా కుటుంబాన్ని గాలికి వదిలి భర్త వెళ్ళిపోతే ఏ ఆసరాలేని ఒక ఆడది పడే వేదన కు బాధ్యత ఎవరిది?.
కుటుంబ యజమానిగా ఆ బాధ్యత ఆమె భర్తది. విచ్ఛిన్నమైన కుటుంబ వ్యవస్థ వల్ల,బాధ్యత లేని వ్యక్తుల వల్ల జరిగిన ఈ నేరంలో సాంకేతికంగా ఒక తల్లి నేరస్తురాలయింది.

ఈ కేసు లాంటి ఎన్నో సంఘటనలు సమాజంలో జరుగుతూనే ఉన్నాయి.
కారణాలు ఏమిటి అని సమాజం తనలోనికి తొంగి చూసుకోవలసిన పరిస్థితి వచ్చింది.

- **కూతురు మరణానికి కారణమైన ఆ తల్లికి కింది కోర్ట్ రిమాండ్ విధిస్తే, దయామయుడైన ఒక న్యాయవాది ఆమె కేసును హైకోర్టుకు తీసుకెళ్లాడు.**

లఖీబెన్ పూనాభాయ్ సోలంకి వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్, కేసు నెంబర్ R/Criminal Misc. Application No. 16673 of 2026 ద్వారా న్యాయవాది అహ్మదాబాద్ హైకోర్టులో అప్పీల్ ఫైల్ చేశాడు.

**బెయిల్ కొరకు అడ్వకేట్ సైటేషన్ నెంబర్: 2026 LiveLaw (Guj) 211 ప్రామాణికంగా చూపించి చేసిన ఈ అప్పీల్ లో న్యాయమూర్తి జస్టిస్ హస్ముఖ్ డి. సుతార్ ఆ తల్లికి బెయిల్ మంజూరు చేశాడు.**

ఇక్కడితో కేసు పూర్తయిందా?..
సమస్య సమసిపోయిందా అని సమాజం ప్రశ్నించుకోవాల్సిన విషయాన్ని జస్టిస్ గుర్తు చేశాడు.

- ఈ బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి నిండు పోర్టులో మాట్లాడిన మాటలు అక్కడ కోర్టులో ఉన్న వారి కళ్ళల్లో నీళ్లు తెప్పించాయి.

ఈ విషయం తెలిసిన సహృదయులందరూ కూడా కంటతడితో మౌనంగా బాధపడుతున్నారు.




**న్యాయమూర్తి వ్యాఖ్యలు ఏమిటి?**

- నేరస్థులు పుట్టరు.. పరిస్థితులే వారిని నేరస్థులుగా మారుస్తాయి. తీవ్రమైన ఆకలి ఒక తల్లిని ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టేలా చేసిందంటే.. అది ఆమె వ్యక్తిగత వైఫల్యం కాదు, మన సమాజం, సంక్షేమ వ్యవస్థల ఉమ్మడి వైఫల్యం" అంటూ గుజరాత్ హైకోర్టు ఈ హృదయవిదారక కేసులో చేసిన భావోద్వేగ వ్యాఖ్య ఇది.

**ఆకలితో ఉన్న వ్యక్తికి దేవుడు అన్నం రూపంలోనే కనిపిస్తాడు**

ఈ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి విక్టర్ హ్యూగో రాసిన 'లే మిజరబుల్స్' (Les Miserables) నవలని, గుజరాత్ కరవు నేపథ్యంలో పన్నాలాల్ పటేల్ రాసిన 'మానవినీ భవాయి' అనే ప్రముఖ నవలను గుర్తు చేసుకున్నారు.

**మనిషి చెడ్డవాడు కాదు.. ఆకలే చెడ్డది**
అని ఆ కథల్లో చెప్పిన న్యాయమూర్తి సత్యాన్ని సభకు వివరిస్తూ కోర్టులో అందరి కంటతడి పెట్టించే వ్యాఖ్యలు చేసారు.

**కోర్టు కీలక వ్యాఖ్యలు**

**ఒకవైపు ఆకలితో అరిచిన బిడ్డ కడుపు నింపలేక,
ఆగ్రహం,ఆవేశం,నిరాశ,నిస్సహాయతతో కూతురు ప్రాణాలు తీసిన తల్లి.. మరోవైపు ఆమె కడుపులోనే జన్మకోసం పోరాడుతున్న ఇంకో జీవి!.**
ఇది కేవలం ఒక కుటుంబంలో జరిగిన విషాదం కాదు. మన సామాజిక న్యాయ వ్యవస్థను ప్రశ్నిస్తున్న సత్యం." అని జస్టిస్ హస్ముఖ్ డి సుతార్ వ్యాఖ్యానించారు.

ప్రతి మతంలోనూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే పరమధర్మమని చెప్పారని గుర్తుచేస్తూ..

**భగవద్గీత, బైబిల్, ఖురాన్ లలోని పవిత్ర వాక్యాలను కోర్టు ఉటంకించింది.**

**అలాగే**
"ఆకలితో ఉన్న ప్రజలకు దేవుడు నేరుగా కనిపించడు, కేవలం అన్నం రూపంలోనే కనిపిస్తాడు"... అన్న మహాత్మా గాంధీ మాటలను ధర్మాసనం ప్రస్తావించింది.
చట్టం,న్యాయం, నిబంధనలకు అతీతమైన వాస్తవ జీవితంలో జరుగుతున్న ఘోరాలను ఆపేదెవరు?.

- ఈ సామాజిక ఘోరాలకు రాజకీయ నాయకులు, యాంత్రికంగా విధులు నిర్వహిస్తున్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు బాధ్యత తీసుకోవాల్సి ఉన్నది.

**తమ ముందు విచారణకు వచ్చిన కేసులను విచారించి తీర్పులు ఇవ్వడం తప్ప న్యాయవ్యవస్థ కూడా ఏమీ చేయలేని పరిస్థితులు సమాజంలో నెలకొన్నాయి.**

- **కూతురును హత్య చేసిన తల్లి ఒక్కతే నేరస్తురాలు కాదు.బాధ్యత లేకుండా ముగ్గురు పిల్లలను కడుపుతో ఉన్న భార్యను గాలికి వదిలేసి,వైవాహిక కట్టుబాట్లను,పెళ్లి ప్రమాణాలను, కుటుంబ బాధ్యతలను మరచిన భర్తను ఈ నేరం లో ప్రధాన ముద్దాయి గా చేర్చాలి.**

**ఒక వ్యక్తి, ఒక కుటుంబం యొక్క ఉపాధికి రాజకీయ నాయకత్వం బాధ్యత వహించదా?**

ఆ కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితిని గమనించి ఆదుకోవలసిన బాధ్యత సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు లేదా?

ఇలా ప్రశ్నించుకుంటూ పోతే.. సమాజంలో నెలకొన్న విపరీతాలను ఎవరు సవరించాలి?

**రాగద్వేషాలకు, పార్టీల సిద్ధాంతాలకు, రాద్ధాంతాలకు లొంగిపోయిన ప్రజలు... సెల్ ఫోన్ లకు బుర్రలను అంకితం చేసిన ప్రతి ఒక్కరు కూడా ఈ నేరాలలో బాధ్యులే.**

- స్వర్గీయ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగంలోని స్ఫూర్తి కాగితాలకు పరిమితం కాదు.

**రాజ్యాంగ స్ఫూర్తిని క్రియాశీలంగా మార్చలేని రాజకీయ పార్టీలది నాయకులది పూర్తి బాధ్యత.**

- ఓట్లు వేయించుకొని, సీట్లలో కూర్చునే రాజకీయ నాయకులు సమాజాన్ని పూర్తిగా విస్మరించారన్న వాదన కఠినమైన వాస్తవం.

రాజకీయ వ్యవస్థ అధికారాన్ని చలాయించడం కాదు.
ప్రజల జీవితాలను సంస్కరించడం సరిదిద్దడం వారి విధి,వారి బాధ్యత.

**భారత రాజ్యాంగం ద్వారా ఏర్పడ్డ చట్టాలు, న్యాయవ్యవస్థ, పాలనా వ్యవస్థతో పాటు సామాజిక సంస్థలు, ప్రజలు కలిసి సమాజాన్ని దేశాన్ని సంస్కరించకపోతే, సరైన దిశలో పాలన సాగించకపోతే దేశం మనుషులను కోల్పోయి మట్టిగా మాత్రమే మిగులుతుంది.**

గురజాడ రాసిన కవితను మార్చి **దేశమంటే మనుషులు కాదోయ్..దేశమంటే మట్టి మాత్రమేనోయ్** అని పాడుకోవాల్సి వస్తుంది.

**చట్టం మరియు పాలన అనేవి కేవలం అధికార పీఠాల కోసం కాదు; సమాజంలో చిట్టచివరి వ్యక్తి కన్నీరు తుడవడానికే.**
-జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్.

**రాజ్యాంగం ఎంత మంచిదైనా, దానిని అమలు చేసేవారు (ప్రభుత్వాలు) సరిగ్గా లేకపోతే అది విఫలమవుతుంది." ప్రజల సామాజిక, ఆర్థిక జీవితాల్లో మార్పు తేవడమే ప్రజాస్వామ్య ప్రభుత్వాల అసలు సిసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు.**
-డా. బి.ఆర్. అంబేద్కర్...

- సమాజ క్షేమం కాంక్షించే మహానుభావులు,మార్గదర్శకులు, దీర్ఘ దర్శుల మాటలు సుపరిపాలనకు కరదీపికలు.

## రాఘవేంద్ర నగర్ కాలనీలో తాగునీటి కష్టాలు మున్సిపల్ కమిషనర్ కువినతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్, మల్కాజ్‌గిరిలోని పూడూర్--కిష్టాపూర్ డివిజన్ రాఘవేంద్ర నగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మాధురికి శు క్రవారం వినతిపత్రం సమర్పించారు. కాలనీలో నాలుగు నుంచి ఐదు రోజులకోసారి కూడా సక్రమంగా తాగునీటి సరఫరా జరగడం లేదని, దీంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వాటి ఖర్చు భరించలేకపోతున్నామని, అవసరమైన సమయంలో ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉండడం లేదని ఏఎంసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.

## మెట్‌పల్లి మహాలక్ష్మి టెంపుల్ ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమం



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం మహాలక్ష్మి బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వన మహోత్సవంలో భాగంగా మహాలక్ష్మి టెంపుల్ ఆవరణలో వెల్మ కార్పొరేషన్ చైర్మన్ నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఎస్పీ రాములు, సీఐ సురేష్ బాబు, ఎస్సై కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఓసి జేఏసీ నాయకులు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 7**
తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్ర పటానికి ఓసి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు గోపు జయపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్, నాయకులతో కలిసి టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షులు, ఓసి జేఏసీ కోశాధికారి లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్నతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. ఇంత చిన్న వయసులోనే పెద్ది సుదర్శన్ రెడ్డిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. పెద్ది లేని లోటు పుడ్చలేనిదని ఇలాంటి కష్ట సమయంలోనే మనోధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓసి జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా..

**కరపత్రం ప్రతినిది హుజరాబాద్, ఆగస్టు 7**
తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం హుజరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా జూపాక గ్రామానికి చెందిన నాలుగో వార్డు సభ్యుడు గురుకుంట్ల రాజు నియమితులయ్యారు. తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు నాగవల్లి జ్యోతి ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బండారి భరత్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా గురుకుంట్ల రాజు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి నియోజకవర్గ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నియోజకవర్గ పరిధిలోని వార్డు సభ్యుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.అదేవిధంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉన్న లోపాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడతానని స్పష్టం చేశారు. వార్డు సభ్యుల పాత్రను మరింత బలోపేతం చేస్తూ వారి గౌరవం, హక్కుల సాధనకు ఫోరం వేదికగా పనిచేస్తానని తెలిపారు.గురుకుంట్ల రాజు నియామకంపై జూపాక గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి స్వప్న--వెంకటేష్, ఉపసర్పంచ్ గిన్నారపు మహేందర్, వార్డు సభ్యుడు ఇల్లందుల వెంకటేష్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సమర్థ నాయకత్వంలో వార్డు సభ్యుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన సీఐపై చర్యలు తీసుకోవాలి

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 07**
ఆస్తి వివాదంలో సనత్ నగర్ సీఐ అశోక్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధితుడు ప్రేమ్చందరు వేదింపులకు గురిచేస్తున్నాడని ఆర్పీఐ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వర్ రావు గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు సీఐ అశోక్ పై చట్టరిత్యా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శు క్రవారం నగర పోలీస్ కమీషనర్ సజ్జనార్ ను నాగేశ్వర్ రావు గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... ఫతేనగర్ ప్రాంతానికి చెందిన ప్రేమ్ చంద్ ఆస్తి విషయంలో స్పష్టమైన హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి వాటిని సీఐ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. ఆస్తి విషయంలో ప్రేమ్ చంద్ కు చట్టబద్ధంగా హక్కులు ఉన్నప్పటికీ ఆ ఆస్తిలోకి ప్రేమచంద్ వెల్లకుండా సీఐ అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. సీఐ హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించడం, పోలీస్ అధికారాన్ని దుర్వినియోగం, తప్పుడు క్రిమినల్ కేసులు నమోదు చేసినందుకు సీఐ పై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ లీగల్ సెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయవాదులు





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 7**
తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్ర పటానికి బిఆర్ఎస్ లీగల్ సెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గుర్రాల వినోద్ కుమార్, కార్యదర్శి శివరాజ్ తో పాటు శ్రీరాశీ కిరణ్ కుమార్, పుల్ల ప్రవీణ్ కుమార్ ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్నతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. ఇంత చిన్న వయసులోనే పెద్ది సుదర్శన్ రెడ్డిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. పెద్ది లేని లోటు పుడ్చలేనిదని ఇలాంటి కష్ట సమయంలోనే మనోధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## బోనాలను శాంతి యుతంగా జరుపుకోవాలి చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి :కాచిగూడ, ఆగస్టు 7**
ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే బోనాల వేడుకలతో పాటు రానున్న గణేష్ ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి భక్తులకు, నిర్వహాకులకు సూచించారు. కాచిగూడ ఇన్స్పెక్టర్ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల నిర్వాహాకులు, సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... బోనాల ఉత్సవాల్లో.. ఫలహారపు బండ్ల ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా డీజే షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోనాల ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకునే విధంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వీరకౌశిక్, సెంట్రల్ పీస్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్, రమేష్ యాదవ్, లడ్డూ యాదవ్, నందకిషోర్ యాదవ్, అబ్దుల్ కబీర్, యూసుఫ్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటేరియన్స్ జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

- ఉత్సాహభరిత భాగస్వామ్యం



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 7**
దేశ ప్రజాప్రతినిధుల మధ్య క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న 6వ పార్లమెంటేరియన్స్ జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు న్యూఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆవరణలో ఉన్న జిందాల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.
ఈ పోటీల్లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం సాయంత్రం పాల్గొని తన తోటి పార్లమెంట్ సభ్యులతో కలిసి బ్యాడ్మింటన్ ఆడారు. ప్రత్యర్థులతో హుషారుగా పోటీపడుతూ క్రీడాస్ఫూర్తిని చాటారు. ఇతర ఎంపీలతో ఆత్మీయంగా మమేకమవుతూ స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన మ్యాచ్‌లు ఆకట్టుకున్నాయి.
గురువారం (ఆగస్టు 6) ప్రారంభమైన ఈ జాతీయ స్థాయి పోటీలు ఆగస్టు 9 (ఆదివారం) వరకు కొనసాగనున్నాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఈ పోటీల్లో పాల్గొంటుండటంతో క్రీడల ద్వారా పరస్పర స్నేహం, ఐక్యత, ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు ప్రజాసేవతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు క్రమశిక్షణ, సమన్వయం, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని, ఇలాంటి టోర్నమెంట్‌లు పార్లమెంట్ సభ్యుల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు.

## టీపీసీసీ సోషల్ మీడియా ఛైర్మన్‌గా నవీన్ పెత్తెం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)లో పలు కీలక నియామకాలు జరిగాయి. టీపీసీసీ సోషల్ మీడియా విభాగానికి నూతన ఛైర్మన్‌గా నవీన్ పెత్తెంను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. అలాగే మీడియా, పబ్లిసిటీ విభాగం ఛైర్మన్‌గా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్‌గా పనిచేసిన నవీన్ పెత్తెం, ప్రస్తుతం రాష్ట్ర రవాణా అథారిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయనతో పాటు సోషల్ మీడియా విభాగానికి కన్వీనర్లుగా కె.ఉజ్వల్ రెడ్డి, పి.వంశీకృష్ణలను నియమించారు. అంబాల శివకుమార్, విష్ణు వర్ధన్ రెడ్డి, వీరాపురం రామ్ లక్ష్మణ్, గీత అయినాల, ఎండీ అబిద్ అలీ, సుశీల్ కుమార్‌లను కోఆర్డినేటర్లుగా ఎంపిక చేశారు. అయితే, సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్ పదవిని స్వీకరించేందుకు గీత అయినాల నిరాకరించారు. ప్రస్తుతం టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కన్వీనర్‌గా ఉన్న ఆమె, ఈ నియామకం పట్ల ధన్యవాదాలు తెలుపుతూనే, ఈ పదవిని తాను స్వీకరించడం లేదని 'ఎక్స్' ద్వారా ప్రకటించారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని ప్రతి భారతీయుడు కొనసాగించాలి: డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి

- దేశభక్తి, జాతీయ భావం ప్రతి యువతలో పెంపొందాలి
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపు
- ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి




**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్ట్ 7**
ఆగస్టు – 8 క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి భారతీయుడు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకుని దేశ ప్రగతికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీజీ ఇచ్చిన "క్విట్ ఇండియా" పిలుపు భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక చారిత్రక మలుపు అని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా కోట్లాది మంది భారతీయులు ఏకతాటిపైకి వచ్చి చేసిన ఉద్యమం స్వేచ్ఛా భారత నిర్మాణానికి బలమైన పునాది వేసిందని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుల త్యాగాల వల్లే నేడు మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామని పేర్కొన్నారు. అలాంటి మహోన్నతుల సేవలను ప్రతి తరం గుర్తుంచుకోవడం, వారి ఆశయాలను ఆచరణలో పెట్టడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.
నేటి యువత దేశ చరిత్రను తెలుసుకొని జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని, దేశాభివృద్ధి, సామాజిక సేవ, నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరసత్వం వంటి అంశాలను జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న సమానత్వం, సామాజిక న్యాయం, ఐక్యత, అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. విద్యార్థుల్లో దేశభక్తి, రాజ్యాంగ విలువలు, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విద్యే నిజమైన జాతి నిర్మాణానికి పునాది అవుతుందని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పేర్కొన్నారు. విద్యతో పాటు మంచి సంస్కారం, సామాజిక బాధ్యత, దేశ సేవ పట్ల అంకితభావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. చివరగా, క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులందరికీ ఘన నివాళులు అర్పిస్తూ, వారి ఆశయాల సాధనే వారికి అందించే నిజమైన నివాళి అని లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పేర్కొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో సిబ్బంది కొరత పై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 7**
వరంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల, మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రితో పాటు కేంద్ర సహకారంతో నడిచే ప్రభుత్వ వైద్య సంస్థల్లో వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది కొరతపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ఆయా సంస్థల్లో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గత మూడు సంవత్సరాల్లో ఖాళీల భర్తీకి చేపట్టిన శాశ్వత, కాంట్రాక్టు నియామకాలు, ఇతర చర్యల వివరాలను వెల్లడించాలని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆరోగ్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రాష్ట్ర ప్రభుత్వాలు పంపే ప్రతిపాదనల మేరకు సాంకేతిక, ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వైద్యులు, నర్సింగ్,



పారామెడికల్ సిబ్బంది మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలు హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా (హెచ్ డి ఐ) నివేదికలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వైద్యుల కొరత నివారణకు ప్రత్యేక అలవెన్సులు, ప్రోత్సాహకాలు, కాంట్రాక్టు నియామకాలు, 'యూ కోట్--వీ పే' వంటి విధానాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. ఆరోగ్యం రాష్ట్ర అంశమని చెప్పి కేంద్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సమంజసం కాదన్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రధాన వైద్య సేవలు అందిస్తున్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. దీనివల్ల రోగులు నాణ్యమైన వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎంజీఎం వంటి కీలక ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఖాళీల భర్తీకి కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని, తెలంగాణకు అవసరమైన అదనపు సహకారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఆరోగ్య రంగంలో బాధ్యతలను రాష్ట్రాలపైకి నెట్టివేయకుండా కేంద్రం తన వంతు బాధ్యతను నిర్వర్తించి, వైద్య సిబ్బంది ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు.

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

- కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులతో చేనేత కళాకారులకు సత్కారం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 7**
హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), తెలంగాణ చేనేత అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దూడం వెంకటరమణ, ఉపాధ్యక్షురాలు జక్కని అనిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యుడు ఈరవత్రి అనిల్, వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి, కమర్తపు మురళి, గడ్డం జగన్నాథం, కందకట్ల స్వామి, మచ్చ వరలక్ష్మి, అంకం శ్రీనివాస్, మాసన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేనేత విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన ప్రముఖ చేనేత కళాకారులు గోరంట్ల రాజు, కంచ సమతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసే కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. చేనేత కార్మికుల



నైపుణ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా ప్రభుత్వం పలు సంక్షేమ, ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి, చేనేత కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో చేనేత కళాకారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎన్ఐటీ వరంగల్‌లో 22 మంది విద్యార్థులకు రూ.6.21 లక్షల స్కాలర్‌షిప్‌లు, ల్యాప్‌టాప్‌ల పంపిణీ

- పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభావంతులకు ఆర్థిక చేయూత -- ఉన్నత విద్యకు ప్రోత్సాహం

**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 7**
జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) వరంగల్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక అండగా నిలుస్తూ, 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంస్థలోని హోమీ భాభా హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ సంబంధాలు, పూర్వ విద్యార్థుల వ్యవహారాల విభాగం, ఎన్ఐటీ వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ విద్యా సంవత్సరానికి ఇంపాక్ట్--99, ఎంపవర్--2000, మెరిట్--కమ్--మీన్స్--79 స్కాలర్‌షిప్ పథకాల కింద మొత్తం 22 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో 19 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున స్కాలర్‌షిప్ చెక్కులు అందజేయగా, ఒక విద్యార్థికి రూ.62 వేల ప్రత్యేక ఆర్థిక సహాయం అందించారు. మరో



ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.42 వేల విలువైన ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం రూ.6.21 లక్షల విలువైన ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి ముఖ్య అతిథిగా హాజరై ఎంపికైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులు, ల్యాప్‌టాప్‌లను అందజేశారు. అంతర్జాతీయ సంబంధాలు, పూర్వ విద్యార్థుల వ్యవహారాల విభాగం డీన్ ప్రొఫెసర్ టి. కిశోర్ కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్, పూర్వ విద్యార్థుల సంఘం గ్లోబల్ అధ్యక్షుడు అశోక్ దయాల్, గ్లోబల్ ఉపాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, గ్లోబల్ కార్యదర్శి గుంజి మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ వి. రామ, కోశాధికారి ప్రొఫెసర్ జి. నాగ



శ్రీనివాసులు, వరంగల్ చాప్టర్ కార్యవర్గ సభ్యులు, ప్రముఖ పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు, ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో పూర్వ విద్యార్థుల సంఘం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ఇటువంటి స్కాలర్‌షిప్‌లు ఎంతో ఉపయోగపడటంతో పాటు, సంస్థతో పూర్వ విద్యార్థుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సంఘం, ఎన్ఐటీ వరంగల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ ఆర్థిక సహాయం తమ విద్యాభ్యాసాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగించేందుకు దోహదపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు.